క్లుప్తంగా

ఆశ్రమ పాఠశాల తనిఖీ

పెద్దవూర : మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గత మూడు రోజులుగా వాయిస్ ఫర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాయిస్ '4' చేంజ్ కార్యక్రమాన్ని సంస్థ ప్రోగ్రామింగ్ మేనేజర్ మధు సమీర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌమారదశలో విద్యార్థులలో వచ్చే మార్పులపై జిల్లాలోని ఆరు ఆశ్రమ పాఠశాలల్లోని ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వరకు విద్యార్థులకు పది రోజుల పాటు శిక్షణ నిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణతో విద్యార్థులలో భవిష్యత్‌లో మానవహక్కులు, సమానత్వం వంటి వాటిపై శిక్షణ నిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి.బాలోజీ, ఉపాధ్యాయులు రాంరెడ్డి, షబ్బీర్, శ్రీనునాయక్, సంధ్య, షాహీన్‌బేగం, శాంతి, సైదులు, శివలీల, ఏఎన్ఎం జ్యోతి పాల్గొన్నారు.

ఓట్ల కోసమే కాంగ్రెస్ బీసీ నినాదం

మిర్యాలగూడ టౌన్ : ఓట్ల కోసమే కాంగ్రెస్ బీసీ నినాదం ఎత్తుకుందని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులు అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటి నుంచి నేటి వరకు కూడా ఏ రాజకీయ పార్టీ కూడా బీసీలను పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సమీపిస్తుండటంతో బీసీ నినాదంతో వస్తున్నారన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ బీసీఈ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాటి శివరామకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుణగంటి వెంకన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వద్దిపట్ల వినోద్ కుమార్, బీసీ సంఘం నాయకులు చింతపండు ఎల్లయ్య, కరుణాకర్ తదితరులున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

మిర్యాలగూడ టౌన్ : రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి వ్యభిచార గృహంపై పోలీసులు దాడులను నిర్వహించారు. ఈ దాడిలో ముగ్గురు విటులు, ఇద్దరు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే ఆ వ్యభిచార గృహం చాలా రోజుల నుంచి నడుస్తున్నట్లు సమాచారం.

హమాలీ ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ టౌన్ : హమాలీ కార్మికుడు ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మిర్యాలగూడ మండల పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం ... మిర్యాలగూడ మండలం దుబ్బతండాకు చెందిన ధనావత్ రమేష్ అనే వ్యక్తి శ్రీనివాస్‌నగర్‌లోని ఓ గోదాంలో హమాలీగా పని చేస్తున్నాడు. విధుల్లో ఉన్న సమయంలో రమేశ్ ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. వెంటనే తోటి హమాలీలు చూసి మంటలు ఆర్పి మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి


అంజద్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: స్నేహితుడితో కలిసి ఈతకు వెళ్లిన వ్యక్తి కాలువలో మునిగి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం మిర్యాలగూడ మండలంలో జరిగింది. రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన అంజద్(43) తన స్నేహితుడు, బంధువు అయిన నాగుల్‌తో కలిసి మిర్యాలగూడ మండలం కాలువపల్లి వద్ద సాగర్ మేజర్ కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈత కొడుతూ అంజద్ కాలువలో మునిగిపోయాడు. అంజద్ గతంలో అడవిదేవులపల్లిలో వీఆర్‌ఓగా పనిచేయగా.. వీఆర్ఓ వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేయడంతో దేవరకొండ జెడ్పీహెచ్ఎస్‌లో ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మేజర్ కాలువలో మనిషి మునిగేంత నీరు లేకపోవడంతో అంజద్ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఆసియా బేగం, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

కొండమల్లేపల్లి : మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని కొండమల్లేపల్లి ఎస్ఐ అజ్మీరా రమేశ్ వాహనదారులను హెచ్చరించారు. మండల పరిధిలోని కొల్‌ముంతల్‌పహాడ్ స్టేజ్ వద్ద గల 167 జాతీయ రహదారిపై గురువారం రోజు వాహనాల తనిఖీలలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులకు పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ఈ తనిఖీలలో పోలీసు సిబ్బంది విజయేందర్ రెడ్డి, నాగరాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎన్ఎస్‌పీ క్వార్టర్లు

- శిథిలావస్థకు చేరుతున్న భవనాలు
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న కాలనీ వాసులు


శిథిలావస్థకు చేరిన ఎన్ఎస్‌పీ క్వార్టర్లు


ఓ క్వార్టర్ ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్లు

మిర్యాలగూడ టౌన్ : ఏడు దశాబ్దాల క్రితం (1955) నాగార్జునసాగర్ డ్యాం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. ఆ సమయంలో పట్టణంలోని అప్పట్లో 88 ఎకరాల భూమిని ఎన్ఎస్‌పీ క్యాంపునకు కేటాయించారు. దీంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు డ్యాం నిర్మాణ సమయంలో మిర్యాలగూడ ప్రధాన కేంద్రంగా ఏర్పాటు చేసుకొని సర్కిల్ ఆఫీస్, వర్క్‌షాపు, అకౌంట్ విభాగాలతో పాటు ఉద్యోగులు, అధికారులు నివాసం ఉండేందుకు ఎన్ఎస్‌పీ అధికారులు గృహాలను నిర్మించారు. అయితే ఈ భూమిలో గృహాలను నిర్మించే సమయంలో ఏ టైపు, బీ టైపు, సీ టైపుతో పాటు పలు కార్యాలయాలను ఏర్పాటు చేశారు. గతంలో మిర్యాలగూడలోనే ఎన్ఎస్‌పీ డివిజన్ కార్యాలయం, సబ్ డివిజన్ కార్యాలయం, సర్కిల్ కార్యాలయాలు ఇక్కడే ఉండేవి. దీంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రధాన కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించడంతో పాటు ఉద్యోగులు, కార్మికులు కూడా బదిలీ అయ్యారు. ఈ ఎన్ఎస్‌పీ క్యాంపులో కార్యాలయాలు, అధికారులు, ఉద్యోగుల కోసం మొత్తం 388 నిర్మాణాలను చేపట్టారు. దీంతో ఇటీవల ఇతర ప్రాంతాలకు కార్యాలయాలు కూడా బదిలీ కావడంతో ఉద్యోగులు కూడా ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో మొత్తం 70 గృహాల వరకు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన వాటిలో కొంత మంది రిటైర్డ్ ఉద్యోగులు, మరి కొంత మంది ఇతర ఉద్యోగులతో పాటు ఇతరులు ఉంటున్నారు.

నిర్వహణ లోపం

ఈ క్యాంపులోని ఎన్ఎస్‌పీకి చెందిన ఉద్యోగులు కొంత మంది ఇక్కడ నుంచి బదిలీ కావడంతో సుమారు 70 గృహాల వరకు ఖాళీగా ఉండి శిథిలావస్థలోకి చేరుతున్నాయి. కొన్ని కూలుతుండగా మరి కొన్ని గృహాల్లో ఏపుగా చెట్లు పెరిగి విషపురుగులు సంచరిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం ఉంటున్న వారు బిక్కు బిక్కు మంటు నివాసం ఉంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో చాల వరకు శిథిలావస్థలోకి చేరుతున్నాయి. ప్రస్తుతం ఈ క్వార్టర్లలో నివాసం ఉంటున్న వారు రేకుల గృహాలకు 389, స్లాబ్ గృహాలకు 654లతో పాటు కొన్నింటికి రూ.628, రూ.1140లను చెల్లిస్తున్నట్లు సమాచారం. అయితే ఉన్న క్వార్టర్లను పట్టించుకునే వారు కరువయ్యారు.

విషపురుగులు వస్తున్నాయి



ఎన్ఎస్‌పీ క్యాంపులో చాలా వరకు గృహాలు ఖాళీ ఉండటంతో ఆ స్థలాల్లో విషపురుగులు సంచరిస్తున్నాయి. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు కూడా అనేక సార్లు విన్నించిన ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. మున్సిపల్ అధికారులు సమస్య పరిష్కరించాలి.

– ఖరీమున్నీసాబేగం, ఎన్ఎస్‌పీ క్యాంపు మిర్యాలగూడ

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- తెలంగాణ విద్యా కమిషన్ మెంబర్ చారకొండ వెంకటేశ్


మాల్ వెంకటేశ్వర్ నగర్ పాఠశాలలో తరగతి గదులను పరిశీలిస్తున్న చారకొండ వెంకటేష్

చింతపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య అందిస్తున్నట్లు తెలంగాణ విద్యా కమిషన్ మెంబర్ చారకొండ వెంకటేశ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాదు, ఇష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఉపాధ్యాయలు బోధిస్తున్న తీరు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. పాఠశాలలో ఏమైనా సమస్యలున్నాయా, వసతులపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలలోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టాయిలెట్లు, సైన్స్‌ల్యాబ్, తరగతి గదులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, వంటశాలలను పరిశీలించారు. వారి వెంట పాఠశాల హెచ్ఎం, వీటీనగర్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కృష్ణమ్మ, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, అన్వర్, కిరణ్, మోతిలాల్, సౌజన్య,సుధీర్ కుమార్ ఉన్నారు.

ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి

మిర్యాలగూడ టౌన్ : పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లి ముర్రుపాలను తాపిస్తే వ్యాధి నిరోధక శక్తి మరింత పెరుగుతుందని మిర్యాలగూడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రేఖల మమత అన్నారు. గురువారం పట్టణంలోని ముత్తిరెడ్డికుంట అంగన్‌వాడీ కేంద్రం-3లో, సుందర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రం 3లో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. నాగమణి, పోషణ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ టి. కవిత, అంగన్‌వాడీ టీచర్లు బి. నాగమణి, రెహెనా, అంజలిదేవి, హెల్పర్లు శిరసనగండ్ల హైమావతి, సైదమ్మలతో పాటు గర్భిణీలు, బాలింతలు తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లలు పల్లె పద్మ, శ్రీదేవి, సరిత, ఝాన్సీ, స్వరూప, రమా, నాగమ్మ, సునిత తదితరులు పాల్గొన్నారు.

గురుకుల భవన నిర్మాణ పనులు పరిశీలన

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలుర నూతన పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరామ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు అద్దె భవనంలో అరకొర వసతుల నడుమ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రవినాయక్, వినోద్‌నాయక్, హనుమంతు, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించరూ..


గ్రంథాలయ ఆవరణలో పడేసిన వ్యర్థాలు

డిండి : మండల కేంద్రంలోని గ్రంథాలయానికి ప్రహరీ లేక పోవడంతో చుట్టు ప్రక్కల ఉన్న వ్యాపారాల దుకాణాలు, ఇళ్ల నుంచి ప్రతి రోజు వ్యర్థాలను పడేస్తున్నారు.దీంతో దుర్వాసన వస్తుంది. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు ఇబ్బంది ఉంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు పట్టించుకొని వ్యర్థాలను తొలగించాలని, గ్రంథాలయానికి ప్రహరీ నిర్మించేలా చూడాలని గ్రామ ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

మూడు రోజులైనా దొరకని యువకుడి ఆచూకీ

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు చూసేందుకు వచ్చి కృష్ణా నదిపై నిర్మించిన కొత్త వంతెన పైనుంచి దూకిన యువకుడి ఆచూకీ మూడు రోజులైనా లభించలేదు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం జపాల గ్రామానికి చెందిన మంథని శివ(23) తన స్నేహితులైన దుసరి ప్రసాద్(గణేష్), సొప్పరి శివ, పండుగ నర్సింహాతో కలిసి ఈ నెల 4న నాగార్జునసాగర్‌ను చూడటానికి వచ్చారు. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ కాలనీలో కృష్ణా నదిపై గల కొత్త వంతెన మీద నిలబడి ఫొటోలు దిగే క్రమంలో శివ వంతెన పైనుంచి కృష్ణా నదిలోకి దూకి గల్లంతయ్యాడు. శివ తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గత మూడు రోజులుగా ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు సాగర్ సీఐ శ్రీనునాయక్, విజయపురి టౌన్ ఎస్ఐ ముత్తయ్య ఆధ్వర్యంలో కృష్ణా నదిలో గాలింపు చర్యలు చేపడుతున్నా ఇప్పటి వరకు ఆచూకీ లభించలేదు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నాగార్జునసాగర్ : టీజీ పాలిసెట్-2025 కౌన్సిలింగ్‌లో ప్రక్రియలో భాగంగా స్పాట్ అడ్మిషన్ల ద్వారా మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి నాగార్జునసాగర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తయినట్లు ప్రిన్సిపాల్ ఐలయ్య తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్‌లో 29 సీట్లు, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో 2సీట్లు ఖాళీగా ఉన్నట్లు సంబంధించిన స్పాట్ అడ్మిషన్ల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 10వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 11వ తేదీన స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. సీట్ల సంఖ్య పరిమితంగా ఉండటంతో ఆసక్తి గల విద్యార్థులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీజీ పాలిసెట్-2025లో అర్హత పొందిన, పొందని విద్యార్థులు సైతం ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చునని పేర్కొన్నారు . ఇతర వివరాలకు 9491398142 గాని, 9052571315 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



మాడుగులపల్లి : పోలీస్‌స్టేషన్‌లో మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు



కొండమల్లేపల్లి : ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పెద్దవూర: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చలో హైదరాబాద్ వెళ్లటానికి సిద్ధమైన కార్మికులను ముందస్తు అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్‌కే బషీర్ అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ సీఐటీయూ పిలుపు మేరకు చలో హైదరాబాద్ విద్యా శాఖ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. చలో హైదరాబాద్‌కు వెళ్లకుండా గురువారం వేకువజామునే ఇంటి వద్దకు వచ్చి అరెస్టు చేయడం ప్రభుత్వ దుష్టపాలనకు నిదర్శనమన్నారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

మాడుగులపల్లి : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యా కమిషనర్ కార్యాలయ ముట్టడికి వెళ్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను, సీఐటీయూ నాయకులను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. అరెస్ట్ అయిన వారిలో, రొండి శ్రీనివాస్, రేణుక, సైదమ్మ, యాదమ్మ తదితరులు ఉన్నారు.

డిండి : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, జీతాలు చెల్లించాలని కోరుతూ స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఎంఈఓ గోప్యా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు లింగమయ్య, జవహర్‌లాల్, లక్ష్మయ్య, అలివేలు, ఎల్లమ్మ, వెంకటమ్మ, పద్మ, జంగమ్మ, ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కొండమల్లేపల్లి : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం దేవరకొండ మండల విద్యాధికారికి రెండో రోజు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జూలూరి వెంకటరాములు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు జంపుల జంగమ్మ, మండల కార్యదర్శి అలమోని మల్లయ్య, నోముల ధనలక్ష్మి, యాదయ్య, సైదమ్మ, పున్న ఝాన్సి, సి.హెచ్.నారయ్య, జంగమ్మ, శోభారాణి పాల్గొన్నారు.

పాఠశాలలో రాఖీ వేడుకలు


ఉపాధ్యాయుడికి రాఖీ కడుతున్న విద్యార్థిని

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని అల్వాల ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తుగా రాఖీ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు రాఖీలను కట్టి సోదర భావాన్ని తెలియజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బాణోతు సక్రు నాయక్, మాజీ సర్పంచ్ పెంకీసు పాపిరెడ్డి, ఉపాధ్యాయులు తిరుమల్‌రెడ్డి, కృష్ణమూర్తి, జానీపాషా, రామాంజిరెడ్డి, అశోక్, వీరయ్య, భవాని, విజయలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


దుగ్యాల మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠం బోధిస్తున్న కలెక్టర్

పెద్దఅడిశర్లపల్లి : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం పెద్దఅడిశర్లపల్లి మండలం దుగ్యాల మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే శ్రమ, సహనం, పట్టుదలతో ఇష్టపడి చదవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఆమె వెంట దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ జయశ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం గుడిపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జ్వర సర్వేను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు జ్వరపీడితులను గుర్తిస్తు ఉండాలన్నారు.ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి తగు మందులను అందజేయాలన్నారు. ఆమె వెంట ఆర్డీఓ రమణారెడ్డి, వైద్యులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


మిర్యాలగూడ : బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మండలంలోని రాయినిపాలెం గ్రామానికి చెందిన పోలేపల్లి కృష్ణారెడ్డి, లింగాల అఖిలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోని లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా స్టార్ క్యాంపెయినర్ చైర్మన్ పోలగాని వెంకటేష్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ జానీ, జావిద్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : మండలంలోని తోపుచర్ల గ్రామానికి చెందిన వేముల రాములు, కేసాని రాములు, గుండ్రెడ్డి, ప్రమీల, ఏరెడ్ల సీతమ్మలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి అందజేశారు.వేముల రాములుకు రూ.44వేలు, కేసాని రాములుకు రూ.22వేలు, గుండ్రెడ్డి ప్రమీలకు రూ.60వేలు, సీతమ్మకు రూ.16వేల చెక్కులను బాధితులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంగ యాదయ్య గ్రామశాఖ అధ్యక్షుడు గౌని నిరంజన్, కట్ట శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్, వేముల లక్ష్మణ్, జోజి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్

కొండమల్లేపల్లి : ప్రతి ఒక్కరూ బ్యాంకులు అందిస్తున్న వివిధ రకాల సేవలు, లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని కొండమల్లేపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సందీప్ తెలిపారు. గురువారం మండలంలోని చింతకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌బీఐ, సీఎఫ్ఎల్, విద్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకులు అందిస్తున్న వివిధ రకాల సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో ఖాతా తెరవడం, వినియోగించే విధానం గురించి వివరించారు. అనంతరం బ్యాంకులో నూతన ఖాతాలు తెరిచిన పలువురు విద్యార్థులకు పాస్ పుస్తకాలు, ఏటీఎం కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చేపూరి సంజీవకుమార్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ అంకులమ్మ, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, దామోదర్‌రెడ్డి, లింగయ్య, కిషన్, గీత, రవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు

చింతపల్లి : వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారిణి శ్రావణ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తు కొరకు అప్లికేషన్ ఫామ్, పట్టాదారు పాస్ బుక్, డిడి ఒరిజినల్, ఆధార్ కార్డు జీరాక్స్, ఆర్సీ (ట్రాక్టర్ పనిముట్ల కొరకు), పాస్పోర్ట్ సైజ్ ఫోటో ఈ నేల 15లోపు మండల విస్తరణ అధికారులకు అందజేయాలనీ కోరారు. ఎస్సీ ఎస్టీ లకు ఐదు ఎకరాల లోపు గల జనరల్ రైతులకు 50శాతం ఇతరులకు 40శాతం రాయితీ వస్తుందన్నారు. కేటగిరి వారీగా అందుబాటులోఉన్న పనిముట్ల వివరాలు బ్యాటరీ /ఫ్రూట్/ మాన్యువల్ పంపులు 131, పవర్ స్ప్రేయర్ 17, రోటవేటర్-8, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ -2, డిస్క్ హేరో/కల్టివేటర్/ ఎంబిప్లవ్/కేజీవీల్-8, బండ్ ఫార్మర్ నాన్ పీటీఓ 1, బండ్ ఫార్మర్ పీటీఓ 1, పవర్ వీడర్ 1, బ్రష్ కటర్ 2, పవర్ టిల్లర్ 1, మైజ్ షెల్లర్ 1, స్ట్రా బ్యాలెర్స్ 1 అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలను అందజేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి హర్షిత తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు యాభై శాతం సబ్సిడీపై, ఇతరులకు నలభై శాతం సబ్సిడీతో అందజేయనున్నారు. ఈనెల 14వ తేదీ లోగా మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు.

డిండి : సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్ఎంఏఎం) పథకం కింద సబ్సిడీతో అందించే వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను తీసుకునేందుకు రైతులు ఈనెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రెహేనా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ మహిళ రైతులకు 50శాతం, ఇతరులకు 40శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్న పనిముట్లను అందిస్తామని ఆమె పేర్కొన్నారు. మిగతా వివరాలకు సంబంధిత గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి, ఏఓను సంప్రదించాలన్నారు.

అసంపూర్తిగా పల్లె దవాఖాన

- రెండేళ్లుగా పూర్తికాని భవన నిర్మాణ పనులు
- త్వరగా అందుబాటులోకి తేవాలని కోరుతున్న ప్రజలు


నిర్మాణ పనులు పూర్తికాని పల్లె దవాఖాన

మాడుగులపల్లి : మారుమూల గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించేందుకు గత ప్రభుత్వం నిర్మించిన పల్లె దవాఖానాల ఏర్పాటు లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామాల్లో వైద్య సేవలు విస్తరించేలా, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా పల్లె దవాఖానాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ దవాఖానాల్లో అన్ని రకాల సాధారణ వైద్య సేవలు, మందులు అందించడం పల్లె దవాఖానాల ముఖ్య ఉద్దేశ్యం. కాని అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో పల్లె దవాఖానా భవన నిర్మాణ పనులు చేపట్టి రెండేళ్లు అవుతున్నా ఇప్పటివరకు పనులను పూర్తి చేయలేదు. పాత భవనం శిథిలావస్థకు చేరుకోని వర్షం వచ్చినప్పుడు కురుస్తుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయగా వయోవృద్ధులు అంతదూరం వెళ్లలేకపోతున్నారు. ఎన్‌హెచ్ఎం గ్రాంట్ నిధులు రూ.20లక్షలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. దవాఖాన ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి క్రిమికీటకాలకు, దోమలకు ఆవాసంగా మారుతున్నాయని స్థానికులు అంటున్నారు. గ్రామానికి పల్లె దవాఖానా మంజూరు కావడంతో తమకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశించిన ప్రజలు అవి ఉపయోగంలోకి రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వేల రూపాయలను ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పల్లె దవాఖాన నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా పంచాయతీరాజ్ ఏఈ మధును వివరణ కోరగా 80శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభించడానికి కృషి చేస్తామని తెలిపారు.

దవాఖాన ప్రారంభించాలి



మా గ్రామంలో పల్లె దవాఖాన భవన నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. పాత భవనంలో వర్షాలకు కురుస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. అంతదూరం వెళ్లాలంటే మాకు ఇబ్బందిగా ఉంది. బీపీ, షుగర్ మందుల కోసం అంతదూరం వెళ్లలేకపోతున్నాం. త్వరగా కొత్త భవనాన్ని పూర్తి చేస్తే మాకు ఇబ్బందులు ఉండవు. త్వరగా భవన నిర్మాణా ని పూర్తి చేసి ఆస్పత్రి ప్రారంభించాలి

– రాములమ్మ, ఆగామోత్కూర్